సాక్షి ఒడిశా
ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,35,863లు, బంగారం 6.55 గ్రాములు, వెండి 7.3 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ఉత్కళ గౌరవం.. మధుసూదన్‌ దాస్‌ - 8లో.



తొలిదశలో గుర్తిస్తే మేలు - 8లో.

న్యూస్‌రీల్‌

రాజ్‌గురు మృతికి నివాళులు



రాజ్‌గురు పేరిట రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

బరంపురం: నగరానికి చెందిన సీనియర్‌ జర్నలిస్ట్‌ చిరంజీవి రాజ్‌గురుకు పలువురు ప్రముఖులు, మీడియా ప్రతినిధులు నివాళులర్పించారు. కొమ్మపల్లి జంక్షన్‌లోని బైద్రనాథేశ్వర్‌ ఆలయ ప్రాంగణంలో సంతాప సభ శనివారం నిర్వహించారు. బరంపురం ప్రెస్‌క్లబ్‌, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గంజాం బార్‌ అసోసియేషన్‌ న్యాయవాదులు పాల్గొని, రాజ్‌గురు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం రాజ్‌గురు పేరిట రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఒడియా, తెలుగు, హిందీ, ఇంగ్లిషు దిన పత్రికల పాత్రికేయులు, ఎలక్ట్రానిక్‌ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

పర్లాకిమిడి: పట్టణంలోని తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రారంభించిన ఈ బ్రహ్మోత్సవాలు పూర్ణాహుతి, హోమం, ప్రత్యేక పూజలతో ముగిశాయని ఆలయ ప్రధానార్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారన్నారు.

ఎస్పీ శర్మకు సన్మానం



ఎస్పీ శర్మను సన్మానిస్తున్న వర్తకులు

రాయగడ: జిల్లా ఎస్పీ వివేకానంద శర్మను పట్టణానికి చెందిన వ్యాపార, కళింగ వైశ్య సంఘాల ప్రతినిధులు శనివారం సన్మానించారు. కొద్ది రోజుల క్రితం పట్టణంలోని బ్యాంకు కాలనీలో నివసిస్తున్న వ్యాపారి కింతలి సాయిశ్రీనివాస్‌ ఇంట్లో జరిగిన దోపిడీ సంబంధించిన కేసులో పోలీసులు నిందితులను అరెస్టు చేసి, చోరీ సొత్తులో కొంత మొత్తం రికవరీ చేసిన విషయం తెలిసిందే. దీనిని బాధిత కుటుంబానికి అప్పగించడంతో ఆనందం వ్యక్తం చేసిన వ్యాపారులు ఎస్పీ శర్మను శాలువా కప్పి, సన్మానించారు. మిగతా సొత్తును కూడా స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఇప్పిలి సన్యాసిరాజు, బంగారు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు కింతలి అమర్‌నాథ్‌, లాడి రాజు, త్రినాథరావు, నరేన్‌ కుమందాన్‌ సన్మానించారు.

10 ఎకరాల్లో గడ్డికుప్పలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: సబ్‌ డివిజన్‌ బొయిపరిగుడ సమితి బోదాపుట్‌ పంచాయతీ కురికుటి గ్రామంలో గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. కురికుటి గ్రామానికి చెందిన సోదరులు అర్జున ఖొడ, బుదురు ఖొడ, సోంబారు ఖొడ 10 ఎకరాల్లో వరి పండించారు. కోతలు పూర్తి చేయగా వచ్చిన గడ్డిని కల్లంలో కుప్పలుగా వేశారు. అయితే శనివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో కుప్పలకు నిప్పంటుకొని, మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన చుట్టుపక్కల వారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఎప్పటికీ అదుపులోకి రాకపోవడంతో బొయిపరిగుడ అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందజేశారు. సిబ్బంది వెంటనే చేరుకొని, ప్రయత్నించినా, అప్పటికే సగం గడ్డికుప్పలు కాలి బూడిదయ్యాయి.

అది ఒడిశా భూభాగమే..



పలమతులసి గ్రామంలో గుమిగూడిన ఒడిశా-ఆంధ్ర గ్రామాల ప్రజలు

- పలమతులసి సరిహద్దుపై అంగీకరించిన ఆంధ్ర అధికారులు
- సద్దుమణిగిన రోడ్డు నిర్మాణ వివాదం
- పరిశీలించిన రాయగడ, గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్లు, పోలీసులు
- 1954నాటి మ్యాప్‌ ఆధారంగా ఇరు రాష్ట్రాల హద్దులు గుర్తింపు

రాయగడ: జిల్లాలోని సరిహద్దు ప్రాంతం పలమతులసి గ్రామంలో నిర్మిస్తున్న రహదారికి సంబంధించిన భూభాగం ఒడిశా రాష్ట్రానికి చెందినదే అని ఆంధ్ర అధికారులు అంగీకరించారు. దుర్గాపాడు పంచాయతీ పలమతులసి గ్రామంలో అనధికారికంగా పొరుగు రాష్ట్రం అధికారులు ఇటీవల ఎటువంటి అనుమతులు లేకుండా ఒడిశా భూభాగంలో 500మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించగా, స్థానిక గ్రామస్తులు వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య వివాదాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో జనవరి 30న రాయగడ సమితి బీడీఓ లక్ష్మీనారాయణ సాబొతో, తహసీల్దార్‌ తపస్‌రౌత్‌, ఇతర అధికారులు పలమతులసి గ్రామంలో పర్యటించారు. వాస్తవ స్థితిగతులపై అధ్యయనం చేశారు. 1954నాటి మ్యాప్‌ ఆధారంగా హద్దులు వేసి, సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గొలలెంకా, కిడాము, వాడింగ్‌ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఆ సూచిక బోర్డులను తొలగించి, బయట పడేశారు. దీంతో మరోసారి వివాదం రేగింది.

బోర్డులు పీకేయడంతో..

ఈ నేపథ్యంలో స్పందించిన జిల్లా యంత్రాంగం ఆంధ్ర అధికారులకు సమాచారం అందించి, వాస్తవాలను పరిశీలించాలని సూచించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌ జె.రాములమ్మ ఇతర అధికారులు, పోలీసులు, రాయగడ తహసీల్దార్‌ తపస్‌రౌత్‌, బీడీఓ లక్ష్మీనారాయణ సాబతో, ఇతర అధికారులు పలమతులసి గ్రామంలో శనివారం పర్యటించారు. ఇరువర్గాల మధ్య జరిగిన చర్చల అనంతరం మ్యాప్‌ ఆధారంగా భూభాగాలు ఎవరి పరిధిలోకి వస్తున్నాయనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మద్రాస్‌ ప్రెసిడెన్సీ హయాంలోని మ్యాప్‌, ఆంధ్ర, ఒడిశా హద్దులను సూచిస్తూ రాళ్లు, అటవీశాఖ మ్యాప్‌ ఆధారంగా సంబంధిత ప్రాంతం ఒడిశా హద్దుగానే ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు రోడ్డు నిర్మించిన భూభాగం ఒడిశా లోనిదే అని గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్‌ అంగీకరించారు. దీంతో నిర్మాణం పనులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు ఇరురాష్ట్రాల ప్రజల రాకపోకలకు సంబంధించి తమ రాష్ట్రం(ఒడిశా) తరుపునే రహదారి నిర్మిస్తామని స్థానిక అధికారులు హామీ ఇచ్చారు. ఇరు రాష్ట్రాలకు సంబంధించిన వివాదానికి తెరపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



తొలగించి ఉన్న ఒడిశాకు చెందిన గుర్తింపు బోర్డులు



సరిహద్దుపై చర్చిస్తున్న గుమ్మలక్ష్మీపురం, రాయగడ తహసీల్దార్లు, అధికారులు



హద్దులను పరిశీలిస్తున్న ఇరురాష్ట్రాల అధికారులు

ఆన్‌లైన్‌లో అమృత భాష

- ప్రవాసాంధ్రులకు ఉచితంగా తెలుగు బోధన
- 5 దేశాలు, 8 రాష్ట్రాల్లో సేవలు
- రెండేళ్లుగా నిర్వహిస్తున్న తెలుగు కమ్యూనిటీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌



భువనేశ్వర్‌: ఖండాంతరాల్లో మాతృభాష ప్రాచుర్యానికి తెలుగు కమ్యూనిటీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌(టీసీడబ్ల్యూఏ) నడుం బిగించింది. అఖిల భారత తెలుగు సేన ఆధ్వర్యంలో సంస్థ లక్ష్య సాధన కార్యకలాపాలు చురుగ్గా చేపడుతోంది. తెలుగు సాహితీ, సంస్కృతిక విలువల పరిరక్షణతో తెలుగు భాష రాయడం, చదవడం అభ్యసించి నిత్య వ్యవహారంలో తెనుగులో మాటా మంతీ పోకడని ప్రేరేపించడం ధ్యేయమని తెలుగు కమ్యూనిటీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు పీఎస్‌ఎన్‌ మూర్తి తెలిపారు. ప్రపంచం అంతటా విస్తరించిన తెలుగు లోగిళ్లకు మాతృభాష అభ్యాస వ్యవస్థను ఈ సంస్థ ప్రవేశ పెట్టింది. బాల్యం నుంచి మాతృభాష పట్ల మక్కువ పెంపొందించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతోంది. 8 ఏళ్ల వయస్సు నుంచి ఆబాల గోపాలం ఆన్‌లైన్‌లో మాతృ తెలుగు భాష అభ్యసించేందుకు టీసీడబ్ల్యూఏ ప్రత్యేక పాఠ్యాంశాన్ని ప్రవేశ పెట్టింది. స్వల్పకాలిక బోధనతో నిత్య వ్యవహారంలో తెలుగు భాష ప్రాధాన్యతకు ప్రాణం పోస్తోంది.

ప్రతి ఆదివారం తరగతులు..

ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన తెలుగు వారి సౌలభ్యం కోసం ఆన్‌లైన్‌లో తెలుగు భాష బోధన తరగతులు నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా అమృత భాష పాఠ్యపుస్తకం రూపొందించి విద్యార్థులకు బోధిస్తున్నారు. ఏడాది పాటు శిక్షణ కల్పించి పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత ప్రకటిస్తున్నారు. ఏడాది పొడవునా ప్రతి ఆదివారం 2గంటల నిడివితో ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తొలి ఏడాది అమృత భాష కార్యక్రమం విజయవంతమైంది. దేశ, విదేశాల్లో పలు ప్రాంతాల నుంచి 100 మందికి పైగా ఆన్‌లైన్‌లో అమృత భాష అభ్యాసంలో ఉత్తీర్ణత సాధించినట్లు అధ్యక్షుడు తెలిపారు. తొలి సంవత్సరం 5 దేశాలు, 8 రాష్ట్రాల నుంచి ఔత్సాహిక ప్రవాసాంధ్రులు అమృత భాష అభ్యసించారు. రెండో సంవత్సరం శిక్షణ కోసం ప్రక్రియ ఆరంభమైంది. ప్రపంచ వ్యాప్తంగా ఔత్సాహికులకు ఆన్‌లైన్‌లో అమృత భాషను ఉచితంగా బోధించి, అభ్యాసానికి వారధిగా నిలుస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలు, 21 ప్రపంచ దేశాల్లో అఖిల భారత తెలుగు సేన మాతృభాషకు పట్టం గట్టేందుకు నిర్విరామంగా కృషి చేస్తోంది. గృహిణులు, మహిళలు ఈ కార్యక్రమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. భావితరాల్లో తెలుగు భాష దేదీప్యంగా వెలుగొందేందుకు ఈ శ్రద్ధ దోహదపడుతుందని తెలుగు సేన ఆనందం వ్యక్తం చేసింది



ఆన్‌లైన్‌లో అమృతభాష బోధన (ఇన్‌సెట్లో) పీఎస్‌ఎన్‌ మూర్తి, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు

తేనెటీగల దాడిలో ఎమ్మెల్యేకు గాయాలు

భువనేశ్వర్‌: తేనెటీగల దాడిలో ఆనంద్‌పూర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే భగీరథి సెఠి గాయపడ్డారు. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. శనివారం మార్నింగ్‌ వాక్‌ చేస్తుండగా ఆనందపూర్‌ మండల కార్యాలయం రోడ్‌ ప్రాంతంలో అకస్మాతుగా తేనెటీగలు దాడికి గురయ్యారు. వాటి బారి నుంచి కాపాడుకునేందుకు ఎమ్మెల్యే సమీపంలోని మండల కార్యాలయం లోపలికి పరుగులు తీశారు. తేనెటీగల దాడితో ఆయన శరీరం దాదాపు 20 నుంచి 25 శాతం వరకు గాయపడింది. బాధిత ఎమ్మెల్యేను స్థానికులు ఆనంద్‌పూర్‌ ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.



గాయాలపాలైన ఎమ్మెల్యే భగీరథి సెఠి

వాహనదారులకు అపరాధ రుసుం

జయపురం:

మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్‌ నియమాలు ఉల్లంఘించిన వాహణదారులపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పట్టణంలోని బెల్‌ రోడ్డులో మున్సిపాలిటీ విధించిన నియమాలను ఉల్లంఘించి, సరుకు అన్‌లోడ్‌ చేస్తున్న యజమాని నుంచి రూ.3 వేలు జరిమానగా వసూలు చేశారు. మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్‌ ఆధ్వర్యంలో వాహనదారుల నుంచి రూ.2 వేలు ఫైన్‌గా విధించారు.



వాహనదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తున్న అధికారులు

దిగంతాలకు బహుభాష గాయని

- ఓలీవుడ్‌కు పలు సూపర్‌హిట్‌ గీతాలను అందించిన వాణీ జయరాం

భువనేశ్వర్‌: బహు భాష నేపథ్య గాయని వాణీ జయరాం(78) ఆకస్మిక మృతిపట్ల సినీ, సంగీత ప్రియులు విచారంలో మునిగారు. ఒడియాలోని అనేక పాటలకు తన గాత్రంతో రాష్ట్ర శ్రోతల హృదయాల్లో ఆమె సుస్థిరస్థానం సొంతం చేసుకోవడం విశేషం. వాణీ జయరాం ఒడిశా నుంచి రాష్ట్ర అవార్డును సొంతం చేసుకున్నారు. ఒడియాలో శేషా శ్రాబొణొ(1976) చిత్రంలో మేఘొ బొరొసిలా, శేషా శ్రాబొణొ ఆల్బమ్‌లోని ముకుందా మురారి, సింధూర బిందు(1976) చిత్రంలో తుమీ సధీర రంగ, నా జా సజని(బంధు మొహంతి-1977), ఛొట్టొ మోరొ యె ఘొరొ(కృష్ణ సుధామ-1976), ఓం నమః భగబతే(బిల్వమంగళ-1979), కెంవు నామొ ధొరీ(సింధూరొ బింధు-1976), కుహు కుహూ(సతీ అనుసూయ-1978) పాటలు ఆమె ఓలీవుడ్‌కి అందించిన అనేక సూపర్‌హిట్‌ గీతాల్లో కొన్ని మాత్రమే. ఆమె పాటలు పాడిన పలు ఒడియా సినిమాలు సూపర్‌హిట్‌ కావడం విశేషం. ఈ జాబితాలో గౌరీ(1979), బలిదాన్‌(1978), ఒలిభా దగా(1980), పూజ(1981), పతిపత్నీ(1978), హీరా మోతీ మాణికొ(1981), తపస్య(1980), జై మా మంగళ(1980) కొన్ని ఉదాహరణలు.



అలనాటి నేపథ్యగానంలో వాణీ జయరాం

ముఖ్యమంత్రి సంతాపం..

ప్రముఖ నేపథ్య గాయని వాణీ జయరాం మృతిపట్ల ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ శనివారం సంతాపం ప్రకటించారు. ఆమె ఆలపించిన పలు ఒడియా సినిమా పాటలు రాష్ట్ర ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సాధించాయని కొనియాడారు. గాయని పవిత్ర ఆత్మకు భగవంతుని సన్నిధిలో సముచిత స్థానం లభించాలని ప్రార్థించడంతోపాటు కుటుంబీకుల పట్ల సానుభూతి ప్రకటించారు.

మాజీ ఎమ్మెల్యే చరణ్‌దాస్‌ మృతి



అర్జున్‌చరణ్‌ దాస్‌(ఫైల్‌)

భువనేశ్వర్‌: కాంగ్రెస్‌ పార్టీ మాజీ ఎమ్మెల్యే అర్జున్‌ చరణ్‌దాస్‌ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జాజ్‌పూర్‌ ఖరస్రోత వంతెన మీదుగా బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 1995లో జాజ్‌పూర్‌ జిల్లా బింజార్‌పూర్‌ నియోజకవర్గ నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసిన చరణ్‌దాస్‌ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తెలంగాణ సీఎం కె.చంద్రశేఖరరావు ప్రారంభించిన భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్‌)లో చేరేందుకు ఆయన ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు.

185 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన మహిళతో ఎక్సైజ్‌ పోలీసులు



మల్కన్‌గిరి: గంజాయితో పట్టుబడిన నిందితుడు

- ముగ్గురు నిందితులను అరెస్ట్‌ చేసిన పోలీసులు

బరంపురం: నగరానికి సమీపంలోని 16వ నంబర్‌ జాతీయ రహదారిలో అరటి పండ్ల లోడ్‌ ట్రక్కు, బస్సులో అక్రమంగా రవాణా జరుగుతున్న గంజాయిని ఎక్సైజ్‌ విభాగం పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, మహిళతో సహా ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎక్సైజ్‌ అధికారి రమేంద్ర నారాయణనాయక్‌ నాయకత్వంలో సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించగా, 100కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులు రాయగడ జిల్లాకు చెందిన ప్రణబ్‌కుమార్‌ బెహరా, కొందమాల్‌ జిల్లా పిరింగియా గ్రామానికి చెందిన అశ్విని సాహుగా గుర్తించారు. సీజ్‌ చేసిన సరుకు విలువ రూ.8 లక్షలకు పైగా ఉంటుందని వివరించారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎంవీ 11 గ్రామం శుక్రవారం రాత్రి పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న ఎక్సైజ్‌ ఎస్‌ఐ బింబాధర్‌ పండా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 85 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిని రవాణా చేస్తున్న అంగడి సంభయ్యా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

గుప్తేశ్వర్‌ అభివృద్ధికి మాస్టర్‌ ప్లాన్‌

- సిద్ధం చేయాలని సూచించిన 5టీ కార్యదర్శి పాండ్యన్‌

జయపురం: రాష్ట్రంలోని ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌ను అన్ని విధాలా అభివృద్ధి పరిచేందుకు మాస్టర్‌ ప్లాన్‌ సిద్ధం చేయాలని అధికారులను 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్‌ వెల్లడించారు. బొయిపరిగుడ సమితి లోని గుప్తేశ్వర్‌ పుణ్యక్షేత్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గుప్తేశ్వరునికి పూజలు చేసిన ఆయన.. అధికారులు, ఆలయ అర్చకులతో చర్చించారు. శుక్రవారం జయపురంలో జరిగిన బహిరంగ సభలో స్థానిక ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి గుప్తేశ్వర్‌ ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన పాండ్యన్‌.. ఆలయ ఉన్నతికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. చుట్టుపక్కల ఉన్న ప్రకృతి అందాలను దృష్టిలో పెట్టుకొని పర్యావరణాన్ని పరిరక్షించేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అలాగే సమీపంలోని శబరీ నదిని సందర్శించారు. నదీ ఘాట్‌ను అభివృద్ధి పరచాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు.

దమయంతీ సాగర్‌ అభివృద్ధికి..

కొట్‌పాడ్‌లో పర్యటించిన పాండ్యన్‌.. చరిత్రాత్మక దమయంతీ సాగర్‌ను సందర్శించారు. సాగర్‌ సుందరీకరణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. దీనికి సంబంధించి పనుల ప్రణాళికను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కొట్‌పాడ్‌లో నిర్మాణ ఆధీనంలోని బహుముఖీ ఇండోర్‌ స్టేడియం హాల్‌ నిర్మాణాన్ని తనిఖీ చేసి, నిర్ధారిత సమయంలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యమైన సరుకులు వినియోగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం కొట్‌పాడ్‌ కళాశాలను సందర్శించి, తరగతుల గదులను పరిశీలించారు. భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని జిల్లా అధికారులను ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో కొరాపుట్‌ జిల్లా కలెక్టర్‌ అబ్దుల్‌ మహ్మద్‌ అక్తార్‌, అటవీశాఖ అధికారులు నాయకశ్రీ, జోగేంద్ర ప్రతాప్‌సింగ్‌, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్‌ భాస్కర సామంతరాయ్‌, జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ గిరీష్‌చంద్ర రౌత్‌, బీడీఓ అభిమన్య శత్పతి, సమితి సభ్యులు విభీషణ హంతాల్‌, సర్పంచ్‌ పద్మ దురువ, జిల్లా పరిషత్‌ సభ్యురాలు రాజేశ్వర మహురియా పాల్గొన్నారు.



గుప్తేశ్వరునికి పూజలు చేయిస్తున్న వీకే పాండ్యన్‌



కొట్‌పాడ్‌లో దమయంతీ సాగర్‌ అభివృద్ధి ప్రణాళికను పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

రాధాకాంత మఠంలో భాగవత పారాయణం



భాగవత పారాయణం చేస్తున్న యశోదానంద

పర్లాకిమిడి: పట్టణంలోని రాజవీధి పెద్ద రాధా కాంత మఠం గోవర్ధన మందిరంలో భాగవత పారాయణం గత 2 రోజులుగా కొనసాగుతోంది. స్వామీ యశోదానంద దాస్‌జీ మహారాజ్ పాల్గొని, భాగవత్ ప్రవచనాలు, హరినామ సంకీర్తనలు, గోపాల సహస్రనామ పారాయణం జరిపారు. ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న పారాయణం.. ఈనెల 10 వరకు జరుగనుందని దేవీమఠం మహంత రామానంద దాస్ తెలిపారు.

చతుర్భుజ నారాయణ అవతారంలో జగన్నాథుడు



నారాయణ అవతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

పర్లాకిమిడి: స్థానిక బోడదండో జగన్నాథ మందిరంలో మాఘమాసం చతుర్దశి సందర్భంగా జగన్నాథుడు శంఖచక్రాలతో చతుర్భుజ నారాయణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకృష్ణుని సోదరుడు బలరాముడు గదారూపు ధారుడిగా ప్రత్యేకంగా సేవాయత్‌లు అలంకరించారు. ఈ అవతారం ఆదివారం పౌర్ణమి వరకు కొనసాగనుందన్నారు.

కల్యాణ సింగుపూర్ బీడీఓగా ఖోరా



బీడీఓ ఖోరాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి బీడీఓగా సునీల్ ఖోరా శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రాయగడ అదనపు తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన.. పదోన్నతిపై కల్యాణ సింగుపూర్‌కు బదిలీ అయ్యారు. అలాగే గతంలో ఇదే స్థానంలో పనిచేసిన బీడీఓ తపస్ భోయి దేవఘడ్ జిల్లా బొరాఖట్ తహసీల్దార్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా ఖోరాకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు.

ఆస్తి వివాదంతో బాంబుల దాడి

- తీవ్రంగా గాయపడిన వ్యాపారి



బాంబు దాడి దృశ్యాలు

భువనేశ్వర్: ఆస్తి వివాదంపై రేగిన పాతకక్షలు బాంబు దాడికి దారి తీశాయి. జట్నీ కొంతియా ప్రాంతంలో శనివారం జరిగిన ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. దుండగులు ఊహాతీతంగా వరుసగా 7 బాంబులు రువ్వినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. వీటిలో ఒక బాంబు వ్యాపారి కాలికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. జట్నీ ఠాణా పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ ప్రాంతంలో సైంటిఫిక్ బృందం పరిశీలిస్తుండగా, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. వ్యాపార కక్షలు, ఆస్తి వివాదాలతో ఈ దాడి జరిగినట్లు భావిస్తున్నారు. వ్యాపారిపై కక్షతో గురిపెట్టి బాంబు దాడికి పాల్పడినట్లు సమాచారం. ఇందులో వ్యాపారవేత్త రచిత్రానంద సామంతరాయ్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన కాలికి బలమైన గాయం తగలడంతో కాలు కోల్పోయారు. చికిత్స కోసం భువనేశ్వర్‌కు తరలించారు. నిందితులను జట్నీ పోలీసులు అరెస్ట్ చేశారు.

స్క్రాప్ సామగ్రి దగ్ధం

విజయనగరం క్రైమ్: స్థానిక లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న నిల్వలున్న స్క్రాప్ సామగ్రి శనివారం మధ్యాహ్నం దగ్ధమైంది. టైర్లు, ప్లాస్టిక్ సామగ్రి కాలిపోతుండడం చూసిన ప్రయాణికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమందించారు. దీంతో రంగంలోకి దిగిన అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్ఓ సోమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రెండు గంటల పాటూ రెండు వాహనాలతో నీటిని పంపించి మంటలను చల్లార్చారు. షార్ట్ సర్క్యూట్ కానీ, ఎవరైనా మలమూత్ర విసర్జనకు వెళ్లి సిగరెట్ వంటివి విసిరేసారా అనేది తెలియాల్సి ఉంది. అయితే సుమారు లక్ష వరకూ ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని నిర్వాహకులు అంచనా వేశారు.

ఉత్కళ గౌరవం..
మధుసూదన్ దాస్



బరంపురం: కోర్టు ప్రాంగణంలో నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

- సీఎం నవీన్ పట్నాయక్
- దాస్ వర్ధంతి నేపథ్యంలో నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



మధుసూదన్ దాస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం నవీన్

భువనేశ్వర్: ప్రత్యేక ఒడిశా నిర్మాత, ఒడియా భాషకు పట్టంగట్టిన మహనీయుడు మధుసూదన్ దాస్ అని సీఎం నవీన్ పట్నాయక్ కొనియాడారు. రాష్ట్ర గౌరవాన్ని ఇనుమడింపజేసిన ఆయన.. ఉత్కళ గౌరవ్ బిరుదుకు న్యాయం చేసిన వ్యక్తని పేర్కొన్నారు. దాస్ 89వ వర్ధంతి పురస్కరించుకుని శనివారం ఆయనకు నివాళులర్పించారు. విద్య, న్యాయవాదం ఇతరేతర రంగాల్లో ఆయన తొలి ఒడియా వ్యక్తిగా నిలిచారని గుర్తుచేశారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బరంపురం: నేటి తరానికి ఆదర్శ ప్రాయుడిగా మధుసూదన్ దాస్ నిలిచారని గంజాం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిలేశ్వర్ పట్నాయక్ తెలిపారు. గంజాం బార్ అసోసియేషన్, జిల్లా వికాస్ ఎమంచ్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీనగర్ మెయిన్ రోడ్డులో ఉన్న దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాదులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా కపిలేశ్వర్ పట్నాయక్ మాట్లాడుతూ మధుసూదన్ ఒడిశాలో ఉత్కళ సమ్మేళనం స్థాపించి, ప్రత్యేక ఒడిశా స్థాపనకు కృషిచేసిన మహనీయులని పేర్కొన్నారు. మొట్టమొదటి న్యాయవాదిగా సమాజానికి చేసిన సేవలు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే బరంపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో దాస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి.

యూజీఎంఐటీలో..

రాయగడ: స్థానిక ఉత్కళ గౌరవ్ మధుసూదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(యూజీఎంఐటీ)లో మధుసూదన్ దాస్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ పటేల్, జిల్లా పారిశ్రామిక కేంద్రం పీఓ సవ్యసాచి సాహు, రఘునాథ్ చౌదరి, దేవాశీష్ మహంతి తదితరులు దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన జీవిత విశేషాలను కొనియాడారు.



బరంపురం: గాంధీనగర్ జంక్షన్‌లో పూలమాల వేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



రాయగడ: దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ పటేల్

తొలిదశలో గుర్తిస్తే మేలు

- సీడీఎంఓ డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో
- ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంపై అవగాహన



రాయగడ: క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పర్లాకిమిడి: క్యాన్సర్ రోగాన్ని తొలి దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీడీఎంఓ కార్యాలయం నుంచి మహారాజా బాలికల ఉన్నత పాఠశాల, మహేంద్రగిరి ఉన్నత పాఠశాల విద్యార్థినులు శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. దీనిని జిల్లా ప్రజారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎంఎం అలీ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో సీడీఎంఓ డాక్టర్ ప్రదీప్ పాత్రో పాల్గొని, మాట్లాడారు. అరుదుగా వచ్చే క్యాన్సర్ రోగం అంతర భాగంలో కణితులు ఏర్పడి, శరీరమంతటా వ్యాపిస్తుందని తెలిపారు. దీనిని నిర్మూలించడానికి కీమోథెరపీ, రేడియో థెరపీ వంటి చికిత్సలు ఉన్నాయన్నారు. వ్యాధి లక్షణాలు అనేక విధాలుగా శరీరంలో ఏర్పడతాయని, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, పెట్ స్కాన్ల ద్వారా రోగ నిర్ధారణ చేయవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఏడీఎంఓ డాక్టర్ ఇందిరా మహాపాత్రో, మెడికల్ పీఆర్ఓ శత్రుతి తదితరులు పాల్గొన్నారు. పర్లాకిమిడిలో మహేంద్రగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని జిల్లా స్వాస్థ్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు.

జీఐఈటీలో క్యాన్సర్ అవగాహన..

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ నర్సింగ్ విభాగానికి చెందిన విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. గుణుపూర్ సబ్ డివిజన్ హాస్పిటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాన్సర్‌కు కారణాలైన పరికరాల వినియోగంపై ప్లకార్డులు ప్రదర్శించి, రోగులకు వివరించారు. ప్రిన్సిపాల్ పి.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీపీహెచ్‌ఓ డాక్టర్ ఎంఎం అలీ



అవగాహన శిబిరానికి హాజరైన ట్రైనీ నర్సులు

నచ్చిన రంగంలో ప్రోత్సహించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎంపీ భాస్కరరావు

- రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

రాయగడ: విద్యార్థుల్లో దాగి ఉన్న ఆసక్తిని గమనించి, దీనికి అనుగుణంగా వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించినప్పుడే చిన్నారులు తమ లక్ష్యాన్ని అధిగమించగలరని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడి తీసుకు రాకూడదని హితవు పలికారు. పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తగు శ్రద్ధ తీసుకుంటేనే వారు బంగారు బాటలో పయనిస్తారని తెలిపారు. విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్రప్రభుత్వం పట్టణంలోని ఐదు ఉన్నత పాఠశాలలను 5టీ పథకంలో అభివృద్ధి చేపట్టి, మెరుగైన విద్యావిధానాన్ని అందిస్తోందన్నారు. గాంధీనగర్ లోని స్థానిక పాఠశాల అత్యంత పురాతనమైనదని, దీనిని అంచెలంచెలుగా అభివృద్ధి చేయాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం 8వ తరగతి వరకు ఈ పాఠశాలను పదో తరగతి వరకు ఉన్నతి పరిచేందుకు అంతా కలసికట్టుగా కృషి చేయాలని సూచించారు. అయితే స్థలాభావం కావడంతో అభివృద్ధికి అవాంతరం ఏర్పడుతోందన్నారు. ఇప్పటికే ఎంపీ నిధుల నుంచి అవసరమయ్యే తరగతి గదులు, మరుగుదొడ్లను నిర్మించామని గుర్తుచేశారు.

ఆకట్టుకున్న కార్యక్రమాలు..

మున్సిపాలిటీ ఛైర్మన్ మహేష్ పట్నాయక్ మాట్లాడుతూ తెలుగు, ఒడియా భాషల్లో స్థానిక పాఠశాలలో విద్యా బోధన కొనసాగుతోందని తెలిపారు. ప్రవాశాంధ్రుల విద్యావిధానం మెరుగు పరచడంలో తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. 1964లో ప్రారంభమైన గాంధీనగర్ పాఠశాల ఏర్పాటుకు స్థానిక ప్రముఖులు దివంగత గోకిన రాజు, క్రాంతీలాల్ ఠక్కర్ పెద్ద మనసుతో స్థలాన్ని విరాళంగా ఇచ్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్ చంద్ర అన్నారు. అయితే పాఠశాలలో సమస్యలు ఉన్నప్పటికీ స్థలాభావం కారణంగా వాటిని ప్రభుత్వం నెరవేర్చలేక పోతుందని పేర్కొన్నారు. అనంతరం వార్షిక నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్‌లాల్ మాఝి, సమితి విద్యాశాఖ అధికారి బలరాం హుయిక తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి నెక్కంటి బహుమతులను అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వార్షికోత్సవానికి హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

నేర విచారణలో వైద్యుల నివేదిక కీలకం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి

విజయనగరం లీగల్: వైద్యులు చేసే క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ ఎవిడెన్స్ రిపోర్టులు అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. జిల్లా కోర్టు సముదాయంలో న్యాయసేవా సదన్‌లో నల్సా వారి సహకారంతో క్రిమినల్, ఇన్వెస్టిగేషన్, ఎవిడెన్సు రిపోర్టులపై వైద్యులు, వైద్యాధికారులకు, ప్రొఫెసర్లకు శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ నేర విచారణ, సాక్ష్యాల నివేదికలను రూపొందించే విషయంలో అవగాహన కల్పించారు. వైద్యులు ఇచ్చే నివేదికలపైనే న్యాయమూర్తి ఇచ్చే తుది తీర్పులు ఆధారపడి ఉంటాయని స్పష్టం చేశారు. డాక్టర్లు ఇచ్చే నివేదికలు, కేసు పూర్వాపరాలను అనుసరించి, న్యాయమూర్తులు తీర్పులను ఇస్తారని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పు చేసిన వారు బయట తిరగకూడదని, కేసు, శిక్ష నుంచి తప్పించుకోకూడదని స్పష్టం చేశారు. నేర విచారణ, రిపోర్టులు ఇచ్చే విషయంలో డాక్టర్లు పూర్తి భాగస్వాములై ఉండాలన్నారు. దీని వల్ల నేరాల రేటు కూడా తక్కువుందన్నారు. సదస్సులో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రాధారత్నం, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా, జిల్లా న్యాయసేవల సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురామ్ తదితరులు పాల్గొని, పలు అంశాలను వివరించారు.

లారీ బోల్తా - డ్రైవర్ మృతి

పాచిపెంట: మండలంలోని పి.కొనవలస జాతీయ రహదారి ఘాట్‌రోడ్డుపై శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలు.. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నుంచి క్రేన్‌కు సంబంధించిన మెటీరియల్‌తో ఓ లారీ ఖుర్దా వెళ్తుండగా పి.కోనవలస జాతీయ రహదారి ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి బండరాయిని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అభయ్ సాహుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108తో సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డ్రైవర్ అభయ్‌సాహు మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు

ఆర్టీసీ బస్సు బోల్తా

గుమ్మలక్ష్మీపురం: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు దారిచ్చే క్రమంలో వంతెన గోడను ఢీకొట్టిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు బోల్తా పడిన సంఘటన గుమ్మలక్ష్మీపురం మండలంలో శనివారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు మండ గ్రామ సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగా ఎదురుగా పార్వతీపురం నుంచి నీలకంఠాపురం వెళ్లేందుకు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుకు దారిచ్చే క్రమంలో కాస్త పక్కకు జరిపి నడపటంతో అక్కడి వంతెన గోడకు బలంగా ఢీకొంది. దీంతో పల్లెవెలుగు బస్సు అక్కడికక్కడే కుడిపైపు బోల్తా పడింది. ఈ సమయంలో బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో పాటు 23 మంది ప్రయాణికులున్నారు. ప్రమాదంలో ప్రయాణికులు ఆరిక పావని, విజయశాంతి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యసేవలందించారు. ఈ సమాచారం తెలుసుకున్న పార్వతీపురం ఆర్టీసీ డీఎం దుర్గా సంఘటన స్థలానికి చేరుకొని బోల్తా పడిన ఆర్టీసీ బస్సును పరిశీలించారు. ప్రయాణికుల యోగక్షేమాలపై ఆరా తీశారు. తహసీల్దార్ జె.రాములమ్మ, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్ఐ షన్ముఖరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆర్టీసీ బస్సు ప్రధాన రహదారి మధ్యలో పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా జేసీబీ సాయంతో పక్కకు నెట్టివేయించారు. ఇదే బస్సు కుడివైపునకు కాకుండా ఎడమ వైపున గల గెడ్డలో (లోయలో) పడి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

వైభవంగా రాములోరి రథయాత్ర

- రామతీర్థం తిరు వీధుల్లో ఊరేగిన సీతారామస్వామి
- సామివారి సన్నిధిలో వైభవంగా పండిత పరిషత్
- కనులారా తిలకించిన అశేష భక్తజనం



ఆలయంలో పండిత పరిషత్ నిర్వహిస్తోన్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం శనివారం రామ నామస్మరణతో మార్మోగింది. ఏటా స్వామివారి తిరుక్కల్యాణం అనంతరం మూడోరోజు నిర్వహిస్తున్న రథయాత్రను కనులారా తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. రథయాత్రలో భాగంగా అర్చకులు స్వామివారికి ఉదయం గ్రామబలిహరణం చేపట్టి శ్రీరాముడి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణం, వేదపఠనం, వైదిక సదస్యం తదితర కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం 6 గంటలకు వేద పండితులంతా పండిత పరిషత్‌ను నిర్వహించి నాలుగు వేదాలను భక్తి శ్రద్ధలతో పఠించారు. స్వామివారి విశేషాన్ని వివరిస్తూ మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవవిగ్రహాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక రథంపై ఆశీనులు చేసి పూజలు జరిపారు.

రథంపై రాములోరు...

సరిగ్గా రాత్రి 10 గంటలకు వేద పండితుల వేదమంత్రోచ్ఛరణ, భక్తుల జయజయధ్వానాల నడుమ సీతారామ లక్ష్మణులు రామతీర్థం పురవీధుల్లో ఊరేగి వేలాది మంది భక్తులకు కనువిందు చేశారు. మూడు గంటల పాటు జరిగిన రథయాత్ర మహోత్సవంతో రామతీర్థం పులకించింది. ఆలయ ప్రతిష్ఠ జరిగిన నాటి నుంచి ఆనవాయితీగా వస్తోన్న సీతారామునిపేట, జగ్గరాజు గ్రామస్తులు రథాన్నిలాగి రథయాత్రను ప్రారంభించారు. స్వామివారి ఊరేగింపునకు ముందు పండిత పరిషత్తుత్‌ఎంతో వైభవంగా జరిగింది. ఈ పరిషత్తులో సీతారాముల గుణగణాలను తెలియపర్చడానికి వేదపండితులు పోటీపడిన సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వేద పండితులను దేవస్థానం తరుపున ఘనంగా సన్మానించారు.

పోటెత్తిన భక్తులు

స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించిన రథయాత్రకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. విజయనగరం, నెల్లిమర్ల ప్రాంతాలతో పాటు ఏటీ అగ్రహారం, దన్నానపేట, తంగుడుబిల్లి, గొర్లిపేట, కొత్తపేట, సతివాడ, రామతీర్థం, ఒమ్మి, తదితర పరిసర గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి రథయాత్రను తిలకించారు. పూజాసామగ్రిని రథంపైకి విసిరి స్వామివారిని దర్శించుకున్నారు.

రథయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. దేవస్థాన ఈఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమాన్ని వేడుకగా జరిపించారు.

క్లుప్తంగా

జాతీయ పోటీలకు జశ్వంత్ ఎంపిక


జశ్వంత్

సంతబొమ్మాళి: దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి టెన్ని కాయిట్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చే నెలలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని డోల సూర్యకాంతం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె.వీరభద్ర రావు, ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మి, భవాని, సునీత, పార్వతి, అరుణశ్రీ, ఉమ, చిన్నారావు, రాము, మార్కండేయులు, సీఆర్‌పీ గిరి, రోజా దయాసాగర్, శివ, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో అర్హత, ఆసక్తి గల ఔత్సాహిక యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటికే 11బ్యాచ్‌లు దిగ్విజయంగా పూర్తయ్యాయని, 12 వ బ్యాచ్ ఫిబ్రవరి మూడో వారంలో ప్రారంభమవుతుందని తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్‌తో పాటు మెకానికల్ వర్క్, యోగా, ఫస్ట్ ఎయిడ్‌తో పాటు ట్రాఫిక్ నియమ నిబంధనలు కూడా నేర్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 99630 91999, 73829 21920 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రాజమ్మ తల్లి జాతర ప్రారంభం


జాతరకు హాజరైన పోలీసులు

గార: వత్సవలస రాజమ్మ తల్లి జాతర శనివారం సాయంత్రం మొదలైంది. దాసుళ్లు అమ్మవారి పుట్ట వద్దకు వెళ్లి ఉపావసం చెప్పారు. దీంతో యాత్ర మొదలు కాగా దూర ప్రాంతాల నుంచి భక్తులు వత్సవలస చేరుకున్నారు. ఈ జాతర నాలుగు వారాలు జరగనుండగా, తొలి వారానికి పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎస్ఐ ఎం.మధుసూదనరావు ఆధ్వర్యంలో 120 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే వాహనాలు తూలుగు మీదుగా వత్సవలస చేరుకుంటాయని, తిరిగి శ్రీకూర్మం మీదుగా వెళతాయని, కచ్చితంగా వన్‌వే రూల్స్ పాటించాలని పోలీసులు తెలిపారు.

నృత్య పోటీల్లో చేతనప్రియ ప్రతిభ


చేతనప్రియకు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా బెంగళూరులోని రవిశంకర్ గురూజీ ఆశ్రమంలో జరిగిన పోటీల్లో శివశ్రీనృత్య కళానికేతన్‌కు చెందిన కొమ్ము చేతనప్రియ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని నృత్య దర్శకుడు ఆర్.శ్రీకాంత్ శనివారం తెలిపారు. ఈమెకు గురుపాదుకావనంలో నృత్య భూషణ్ అవార్డును ప్రదానం చేసినట్టు చెప్పారు.

మూడు మహిళా మార్ట్‌లు ఏర్పాటుకు చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్


మార్ట్‌ను పరిశీలిస్తున్న పీడీ విద్యాసాగర్, సీఈవో వెంకట్రామన్

నరసన్నపేట: జిల్లాలో మరో మూడు మహిళా మార్ట్‌లు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్ తెలిపారు. నరసన్నపేటలోని మహిళా మార్ట్‌ను జెడ్పీ సీఈవో వెంకట్రామన్‌తో కలిసి శనివా రం పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ.. నరసన్నపేటలో మహిళా మార్ట్ పనితీరు బాగుందన్నారు. శ్రీకాకుళం అర్బన్‌తో పాటు పలాస, కోటబొమ్మాళిలో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటి ద్వారా మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెరుగుతోందన్నారు. ప్రయోగాత్మకంగా నరసన్నపేటలో జనవరి తొమ్మి దో తేదీన ప్రారంభించిన మార్ట్‌లో సేల్స్ బాగున్నాయని.. మరింత పెరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వీరి వెంట వాటర్ షెడ్ ఏపీడీ మెండ జయరాం ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మృతులు (ఇన్‌సెట్లో) ప్రమాదానికి కారణమైన లారీ

చాన్నాళ్లుగా ఆ దారిలోనే వారు నడుస్తున్నారు. నిత్యం ఆ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. అదే రహదారి వారికి మృత్యుదారి అవుతుందని ఊహించలేకపోయారు. రోడ్డు అంచున, అది కూడా ఎడమ వైపునే నడుస్తున్నా.. దారి కాచిన మృత్యుదేవత వారిని కనికరించలేదు. లారీ రూపంలో వచ్చి నలుగురిని కబళించేసింది. బ్రేకుల పక్కన చెప్పులు ఉంచి బండి నడిపే డ్రైవర్ దురలవాటు, కలిసి కబుర్లు చెప్పుకుంటూ పనులకు వెళ్లే మహిళల అలవాటు కలగలిపి రోడ్డును రక్తసిక్తం చేశాయి. ఆమదాలవలస మండలం మండాది గ్రామంలో లారీ ఢీకొట్టి నలుగురు ఉపాధి వేతనదారులు దుర్మరణం పాలయ్యారు.

చక్రాల కింద చితికిన బతుకులు

- లారీ ఢీకొని నలుగురు మహిళల మృతి
- ఉపాధి పనికి వెళ్తుండగా దుర్ఘటన
- శోక సంద్రంలో మండాది గ్రామం

ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్:

ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేట పంచాయతీ, మండాది గ్రామం కన్నీరుమున్నీరవుతోంది. గ్రామానికి చెందిన నలుగురు మహిళలు ఉపాధి పనులకు వెళ్తూ శనివారం ప్రమాదానికి గురి కావడంతో ఊరు ఉలిక్కి పడింది. ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం..

మండాది గ్రామానికి చెందిన ఉపాధి హామీ వేతనదారులు ఊరిలోనే చెరువు వద్ద ఉపాధి పనులు చేస్తున్నారు. రోజూ పనికి వెళ్లి మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చి తిరిగి నడుచుకుంటూ పనిలోకి వెళ్లడం వీరికి అలవాటు. ఆ అలవాటు ప్రకారమే శనివారం కూడా వేతనదారులు మధ్యాహ్నం భోజనాలు అయ్యాక శ్రీకాకుళం నుంచి పాలకొండ వెళ్లే సీఎస్పీ రోడ్డు మీదుగా నడుచుకుంటూ చెరువుకు వెళ్తున్నారు. అదే సమయంలో విజయనగరానికి చెందిన లారీ (ఏపీ35వై6111) విజయనగరం నుంచి ఒడిశాలోని కాశీనగర్ వైపు వెళ్తూ అతివేగంగా దూసుకు వచ్చింది. రోడ్డు అంచున ఉపాధి వేతనదారులు నడుస్తున్నా.. ఏ మాత్రం స్పీడు తగ్గకుండా వచ్చి అమాంతం వారిని ఢీకొట్టింది. ఘటనలో మండాది గ్రామానికి చెందిన మురువందల పాపమ్మ (52), అంబటి సత్తెమ్మ(55), కురమాన లక్ష్మి(48) అక్కడికక్కడే మృతి చెందారు. అమలాపురపు గౌరమ్మ(55) తీవ్రంగా గాయపడగా.. ఆమెను వెంటనే స్థానికులు 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో మండాది కన్నీరుమున్నీరైంది. మృతులంతా మహిళలు కావడం, అందరివీ నిరుపేద కుటుంబాలు కావడంతో విషాదాన్ని వారు తట్టుకోలేకపోయారు. ప్రమాదం సమాచారం అందిన వెంటనే రోడ్డుపైకి పరుగులు తీశారు.

నిర్లక్ష్యమే కారణం..

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం తోనే నిండు ప్రాణాలు బలైపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీ బ్రేక్ కింద తన చెప్పు ఉండిపోవడంతో బ్రేక్ వేయలేకపోయానని, రోడ్డుపై ఎక్కువ మంది జనాలు కనిపించడంతో ఎటు తిప్పాలో తెలియలేదని డ్రైవర్ పోలీసులకు చెప్పాడు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, ఎంపీటీసీ ప్రభాకరరావు సహాయక చర్యలు అందించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటనా స్థలాన్ని శ్రీకాకుళం డీఎస్పీ మహేంద్ర, సీఐ ఆదాం, ఎస్ఐ వై.కృష్ణలు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.


ఘటనా స్థలంలో మృతదేహాలు

ఒంటరి బతుకు..

అంబటి సత్తెమ్మ (55) వ్యవసాయ పనులు చేసుకుంటూ వచ్చిన కూలి డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. సత్తెమ్మ భర్త పోతురాజు వృద్ధాప్యంతో పని చేసే స్థితిలో లేకపోవడంతో కుటుంబ భారమంతా ఆమె భుజానికెత్తుకున్నారు. సత్తెమ్మకు లక్ష్మీ అనే కుమార్తె ఉంది. కుమార్తె వివాహం చేయడంతో మండాది గ్రామంలో ఇద్దరు భార్యాభర్తలు మాత్రమే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు సత్తెమ్మను మృత్యువు తీసుకెళ్లిపోవడంతో భర్త ఒంటరివారైపోయారు. ఇప్పటివరకు అన్నీ దగ్గరుండి చూసుకున్న భార్య ఇలా దూరం కాడంతో ఆయన కుమిలిపోతున్నారు.

ఆధారం పోయింది..

మురువందల పాపమ్మ (52)ది నిరుపేద కుటుంబం. భర్త అప్పారావు వృద్ధుడు కావడంతో పాపమ్మ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఇద్దరి కుమార్తెలకు వివాహం కాగా.. మూడో కుమార్తె డిప్లమా చదువుతోంది. చిన్న కుమార్తె చదువు కోసం వ్యవసాయ పనులు చేసుకుంటూ నెట్టుకొస్తున్నారు. కుమార్తె చదువు, భర్త అప్పారావు వైద్య ఖర్చులకు ఆధారమైన పాపమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోతోంది.

కుటుంబమంతా వలస పక్షులే..

కురమాన లక్ష్మి (47) వితంతువు. ఈమెకు రామారావు, లక్ష్మణరావు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరూ వలస వెళ్లిపోయారు. మనవరాళ్లతో లక్ష్మి ఊరిలోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదంలో రూపంలో వచ్చిన మృత్యువు లక్ష్మిని కబళించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఆమే పెద్ద దిక్కు..

అమలాపురపు గౌరమ్మ (55) భర్త చనిపోగా కొడుకుతో పాటే ఉంటున్నారు. పింఛన్ డబ్బుతో పాటు కూలి పనులకు వెళ్తూ ఇలా కుటుంబ పోషణకు వేణ్నీళ్లకు చన్నీళ్లలా సాయపడుతోంది. ఈ కుటుంబానికి ఆమే పెద్ద దిక్కు. రోడ్డు ప్రమాదంలో ఆమె చనిపోవడంతో కుటుంబ సభ్యులంతా శోకంలో మునిగిపోయారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర


రేషన్ డీలర్ అక్రమాలపై ఆందోళన

కంచిలి: మండలంలోని జె.బెల్లుపడ రేషన్ డీలర్ అక్రమాలపై దర్యాప్తు చేసి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ కార్డుదారులంతా శనివారం ధర్నా చేశారు. ప్రభుత్వం ఇస్తున్న రేషన్‌ను సకాలంలో ఇవ్వడం లేదని, ప్రజలను మభ్యపెట్టి బ్లాక్ మార్కెట్‌లో రేషన్‌ను అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. సుమారు 100 మంది కార్డుదారులకు రేషన్ ఇవ్వలేదని, చాలా కాలం నుంచి ఇక్కడ ఇదేతంతు జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా సమగ్ర దర్యాప్తు జరిపి, కొలతల్లో అవకతవకలు లేకుండా రేషన్ అందించే విధంగా తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో సర్పంచ్ అయిధం జయరాం, వైస్ సర్పంచ్ దేసెట్టి దాలిబంధు, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై సీఎస్‌డీటీ కూర్మారావు మాట్లాడుతూ ఫిర్యాదుకు సంబంధించి సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని తెలియజేశారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఉపకార వేతనం అందజేసేందుకు నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఆదివారం జరగనుంది. టెక్కలి డివిజన్ పరిధిలోని విద్యార్థులకు టెక్కలిలోనే పరీక్షా కేంద్రాలు కేటాయించారు. మొత్తం 12 పరీక్షా కేంద్రాల్లో 2,840 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఏపీఎంజేపీ, మదర్ థెరిస్సా, ఐజేహెచ్ఎస్, ఆర్‌సీఎం, బీఎస్ అండ్ జేఆర్, ఆదర్శ, అమ్మఒడి, అరుణా, రవీంద్రభారతి పాఠశాలల్లో కేంద్రాలను కేటాయించారు.



పరీక్ష జరగనున్న ఏపీ ఎంజేపీ పాఠశాల

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పురాణం నాగరాణి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్జునాపురం అంగన్‌వాడీ సహాయకురాలు(ఎస్టీ), కొత్తవరక అంగన్‌వాడీ సహాయకురాలు(ఓసీ), బసవ కొత్తూరు అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ-ఈడబ్ల్యూఎస్), బల్లిపుట్టుగ-1 అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ-హెచ్‌హెచ్), జన్నాగాయి అంగన్‌వాడీ కార్యకర్త(ఎస్టీ) పోస్టులను రోస్టర్ విధానంలో భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రూరల్ ఐసీడీఎస్ కేంద్రానికి అందజేయాలని కోరారు.

ఇచ్ఛాపురం: అర్బన్ పరిధి లాలాపేట అంగన్‌వాడీ కేంద్రంలోని అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నాగరాణి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

కోటబొమ్మాళి: మండలంలో ఖాళీగా ఉన్న హరిశ్చంద్రపురం-2 అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు (బీసీ-డీ), కోటబొమ్మాళి-2 ప్రకాష్‌నగర్ కాలనీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ) కేటగిరీల్లో పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీవో వై.లావణ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. పదో తరగతి పాసైన మహిళలు ఈనెల 11లోగా కోటబొమ్మాళి అంగన్‌వాడీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఎస్పీ ఔదార్యం

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలోని ఫుట్‌పాత్‌పై కుష్టు వ్యాధితో బాధపడుతూ వెళ్తున్న వ్యక్తిని ఎస్పీ జీఆర్ రాధిక చూసి చలించిపోయారు. అతనికి వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సాకిపల్లి రామారావు కొంతకాలంగా కుష్టువ్యాధితో బాధపడుతున్నారు. కుటుంబసభ్యులంతా ఆయనను దూరం పెట్టారు. టూటౌన్ పరిధిలోని దామోదరం సంజీవయ్య పార్క్ వద్ద నిస్సహాయ స్థితిలో ఉండటంతో ఎస్పీ రాధిక ఆయన పరిస్థితి చూసి రెండో పట్టణ పోలీసు అధికారులతో మాట్లాడి తక్షణ వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు. రిమ్స్ సిబ్బంది ఆయనను పరిశీలించి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ విషయాన్ని పోలీసులు రోగి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేసి, చికిత్స కొరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఆస్పత్రికి వెళ్లిన వారిలో ఎస్ఐ వెంకటేష్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఎస్పీ ఆదేశాలతో రిమ్స్‌లో దగ్గరుండి వైద్య పరీక్షలు చేయిస్తున్న టూటౌన్ ఎస్ఐ వెంకటేష్


మన వేడుక.. లోకం చూడగా

పర్యాటకం.. గ్లోబలోత్సాహం

- సిక్కోలుకు గ్లోబల్ ఖ్యాతి
- మినిస్ట్రీ ఆఫ్ టూరిజం ఉత్సవ్ యాప్‌లో మన ఉత్సవాలు
- దేశ, విదేశాల పర్యాటకులను ఆకుట్టుకునే యత్నం
- జిల్లాలోని ప్రధాన జాతరలను ఉత్సవ్ యాప్‌లో నిక్షిప్తం చేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పర్యాటక శాఖ సిక్కోలును ప్రపంచానికి చూపిస్తోంది. మన ఉత్సవాల వైభవాన్ని దేశ విదేశాలకు చూపించి పర్యాటక రంగానికి ఊపిరులూదుతోంది. ఉత్సవ్- మినిస్ట్రీ ఆఫ్ టూరిజం యాప్‌లో జిల్లాలోని ప్రధాన ఉత్సవాల సమగ్ర వివరాలను అప్‌లోడ్ చేసి ప్రపంచానికి తెలియజేసేందుకు చర్యలు తీసుకుంది. ఉత్సవాలు జరిగే సమయం, ఆ రోజు ప్రాధాన్యత, ఉత్సవ విశిష్టతను యాప్‌లో పొందుపరిచి దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది.





మౌలిక సదుపాయాల కల్పన..

పర్యాటకంగా జిల్లాను అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం నడుం బిగించింది. అందులో భాగంగా మౌలిక సౌకర్యాలను కూడా కల్పిస్తోంది. రాష్ట్రంలో అత్యధిక పర్యాటకులు వచ్చే మూడో జిల్లాగా ఖ్యాతి గడించిన సిక్కోలును ప్రపంచ స్థాయిలో ప్రమోట్ చేసే పనిలో పడింది. ఇప్పటికే అత్యధికంగా భక్తులు వస్తున్న అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం ఆలయాల వద్ద ఏర్పాటు చేసేందుకు హెల్ప్‌డెస్కలను మంజూరు చేసింది. ఈ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసే భవనంలోనే కంటైనర్ తరహా నిర్మాణం చేపట్టి పోలీస్ అవుట్ పోస్టు, రెస్టారెంట్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. అదే విధంగా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న తొళ్లపాలెంలో పక్కా సౌకర్యాలతో కూడిన వేసైడ్ ఎమినిటీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు అడుగులు ముందుకేస్తోంది. తీర ప్రాంతంలోని దిబ్బపాలెం, మత్స్యలేశంలో బీచ్ డెవలప్‌మెంట్ చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించింది.

ఉత్సవాలు నిక్షిప్తం..

ఒకవైపు జిల్లాలో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా మరోవైపు ఇక్కడ వైభవం, ఖ్యాతి, విశిష్టతను ప్రపంచానికి తెలియజేసేందుకు కూడా మరోవైపు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా జిల్లాలో ఏటా జరిగే ప్రధాన ఉత్సవాలను కేంద్ర టూరిజంకు చెందిన ఉత్సవ్ యాప్‌లో పొందుపరిచే ప్రయత్నాలు చేస్తున్నారు. అరసవల్లి రథసప్తమి ఉత్సవం, శ్రీముఖలింగం చక్రతీర్థ స్థానం, మహాశివరాత్రి వేడుకలు, శాలిహుండం జాతర, కమ్మసిగడాం మహాలక్ష్మి జాతర, శ్రీకూర్మంలో పౌర్ణమి రోజున జరిగే డోలోత్సవం, ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి జాతర, ఇచ్ఛాపురం పీర్లకొండ ఉత్సవం, మందస వాసుదేవ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు, అమదాల వలస సంగమయ్య జాతర, కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర, పాతపట్నం నీలమణి అమ్మవారి జాతర తదితర ప్రధాన ఉత్సవాల విశిష్టతలను మినిస్ట్రీ ఆఫ్ టూరిజానికి చెందిన ఉత్సవ్ యాప్‌లో అప్‌లోడ్ చేసి శాశ్వతంగా ఉంచనున్నారు.

రూట్‌మ్యాప్‌తో సహా..

- ఈ ఉత్సవాలకు హాజరవ్వాలంటే బస్సు, రైళ్లు, విమానాల ద్వారా ఎక్కడి నుంచి ఎలా రావాలి తదితర రూట్ మ్యాప్ కూడా యాప్‌లో పెట్టనున్నారు.

దీని వల్ల రాష్ట్రంలోనే కాదు దేశ, విదేశాల నుంచి ఆ యాప్‌లో ఉన్న ఉత్సవాలు జరిగే సమయానికి వచ్చే అవకాశం ఉంటుందని పర్యాటక శాఖ భావిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉండే ఉత్సవ్ యాప్ ద్వారా జిల్లా ప్రధాన పండగలకు సంబంధించి సమగ్ర వివరాలు పర్యాటకులకు అందుబాటులో రానున్నాయి.

-యాప్‌లో కనిపించే సమాచారంతో పర్యాటకులు నిర్దేశిత సమయానికి వచ్చే అవకాశం ఉంటుంది.

-ఈ మేరకు ప్రధాన ఉత్సవాల డేటా సేకరించి, యాప్‌లో అప్‌లోడ్ చేసే పనిలో నిమగ్నమయ్యామని జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు 'సాక్షి'కి చెప్పారు.

3,150 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

రణస్థలం: కోష్ట గ్రామంలో విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసి ఉంచిన 3,150 కిలోల పీడీఎస్ బియాన్ని పట్టుకున్నారు. దీనికి సంబంధించి విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎ.సురేష్ బాబు ఆదేశాల మేరకు విజిలెన్సు, రెవెన్యూ అధికారులు కోష్ట జంక్షన్‌లోని బొర్రా జగన్నాథం ఇంటి వద్ద కిరాణ దుకాణం వెనుక అక్రమంగా నిల్వ ఉంచిన 3,150 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ. 1,19,700 ఉంటుందన్నారు. బియాన్ని చుట్టుపక్కల గ్రామాల లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. నిందితుడు జగన్నాథం వద్ద బియ్యాన్ని స్వాధీన పరుచుకుని జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో విజిలెన్స్ సిబ్బంది ఎస్.లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు, సివిల్ సప్లయ్ డీటీ బి.హేమసుందర్ ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు శనిలా దాపురించారు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

మందస: రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు శనిలా దాపురించారని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఉద్దాన ప్రాంతమైన అంబుగాంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డారు. అధికారంలేక చంద్రబాబు సైకోలో ప్రవర్తిస్తున్నారన్నారు. ఎల్లో మీడియాను పట్టుకుని నిజాలను అబద్ధాలుగా, మంచిని చెడుగా చూపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను చంద్రబాబు అవహేళన చేసి అపఖ్యాతి మూటగట్టుకున్నారన్నారు. మహిళలను సోమరులుగా చేస్తున్నారని ఆరోపించిన ఆయన తీరును ప్రజ లు గుర్తించుకోవాలన్నారు. 2014లో డ్వాక్రా మహిళల రుణాల ను మాఫీ చేస్తానని మోసం చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నారన్నారు. ఆసరా పథకాన్ని ఇప్పటికే రెండు విడతలుగా డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. జగనన్న మానసపుత్రిక సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా మారుతోందన్నారు. జన్మభూమి కమిటీలతో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు విసిగి వేసారిపోయారని, నేడు వలంటీర్లు, సచివాలయం వ్యవస్థతో ప్రజలకు అన్ని పథకాలూ సక్రమంగా అందుతున్నాయన్నారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పథకాలు చేరుతుండడంతో దళారీ వ్యవస్థకు మంగళం పాడడం జరిగిందన్నారు.

పార్టీలో పలువురి చేరిక

అంబుగాం పంచాయతీకి చెందిన వందమంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. సర్పంచ్ తిరునగరి వెంకాయమ్మ, నవరయ్య ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ జి.కృష్ణారా వు, బొడ్డు హేమరాజు, గుజ్జు సింహాచలం, చెలియా తారక్, అడ వయ్య, బెహరా త్రినాథ్, బొడ్డు గిరిబాబు, రామారావు, గస్యా రంగయ్య, గుజ్జు చిన్నారావు తదితరులు పార్టీ విధానాలకు ఆకర్షితులమై చేరుతున్నట్టు ప్రకటించారు. వీరందరికీ మంత్రి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.